క్లుప్తంగా

అరుణాచల గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు

పట్నంబజారు: ఈ నెల 17వ తేదీ పౌర్ణమిని పురస్కరించుకుని శివభక్తుల కోసం అరుణాచల గిరి ప్రదక్షిణ కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం ఎం.రవికాంత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేదీ రాత్రి గుంటూరులో బస్సు బయలుదేరుతుందని, 16న శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శించుకుని అదే రోజు రాత్రి బయలుదేరి 17వ తేదీ ఉదయం అరుణాచలం చేరుకుంటుందని వివరించారు. గిరి ప్రదక్షిణ, స్వామి వారి దర్శనం అనంతరం సాయంత్రం తిరిగి బస్సు బయలుదేరి 18 ఉదయం గుంటూరుకు వస్తుందని తెలిపారు. ఆన్లైన్ ద్వారా టికెట్లు బుక్ చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. టికెట్ ధర రూ.2,420గా పేర్కొన్నారు. వివరాల కోసం 7382896403కు సంప్రదించాలని కోరారు.

వంట నూనె విక్రయ కేంద్రం ప్రారంభం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ రైతు బజారులో శనివారం వంట నూనెల విక్రయ కేంద్రాన్ని తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్అహ్మద్ ప్రారంభించారు. వంట నూనెల ధరలు పెరిగిపోయిన నేపథ్యంలో తక్కువ ధరకే వంట నూనెలు వినియోగదారులకు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో సాయిబాబా మహాసమాధి కార్యక్రమం



నగరంపాలెం: స్థానిక కొత్తపేట గణేశ్వరరావు వీధిలోని శ్రీషిరిడి సాయిబాబా ధ్యాన మందిరంలో బాబా వారి మహా సమాధి వద్ద శనివారం ఉదయం కాకడ హారతి, పంచామృతాభిషేకాలు, విశేష పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహా సమాధిని రంగుల పూలతో అలంకరించగా, భక్తులు బాబా వారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఆలయ పూజారి చైతన్యశర్మ, ధ్యాన మందిరం నిర్వాహకులు వేపూరి లక్ష్మీ నరసింహారావు, సుబ్బారావు, కొంజేటి మల్లికార్జునరావు, శంకర్, గోపాల్, ప్రమీల, పద్మజ, సునీత పాల్గొన్నారు.

ఆధునిక భారత్కు రతన్ టాటా బాటలు

లక్ష్మీపురం: ఆధునిక భారత్ నిర్మాణానికి పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా బాటలు వేశారని పలువురు పేర్కొన్నారు. అవగాహన సంస్థ కార్యాలయంలో సంతాప సభ ఆదివారం నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ రతన్ టాటా మరణంతో భారత్ ఒక గొప్ప దిగ్గజాన్ని కోల్పోయిందని చెప్పారు. దాతృత్వం, సేవా కార్యక్రమాల్లో ఆయన భాగస్వామ్యం నిరుపమానమని కొనియాడారు.

16 నుంచి ఈశా ఫౌండేషన్ ఇన్నర్ ఇంజినీరింగ్

నగరంపాలెం: ప్రఖ్యాత అంతర్జాతీయ సంస్థ ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి 22 వరకు ఇన్నర్ ఇంజినీరింగ్ (తెలుగులో) అనే కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఈశా వలంటీర్ సాంబశివరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్నర్ ఇంజినీరింగ్ అనేది సద్గురు రూపకల్పన చేసిన ఒక పరివర్తన కార్యక్రమం అని చెప్పారు. ఇందులో సులభమైన యోగ సాధనలు, సెషన్లు, సద్గురు సూచనలతో రూపొందించిన ప్రక్రియలు ఉంటాయని పేర్కొన్నారు. శాంభవి మహాముద్ర క్రియ అనే శక్తివంతమైన 21 నిమిషాల యోగ సాధన ఉంటుందని అన్నారు. దీనివల్ల ఒత్తిడి, భయం, అలర్జీ, బీపీ, ఆందోళన వంటి వాటికి ఉపశమనం కలుగుతుందని తెలిపారు. వివరాలకు 99493 12299 లో సంప్రదించాలని చెప్పారు.

ఆర్యసమాజ సూత్రాలు ప్రచారం చేయడం ఆనందకరం



నగరంపాలెం: నిత్యం ఆర్యసమాజ సూత్రాలను ప్రచారం చేయడం ఆనందకరంగా ఉందని మాజీ ఎంపీ యలమంచిలి శివాజీ అన్నారు. పండిత గోపదేవ్ వైదిక ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో గుంటూరు అరండల్పేట 11/3వ అడ్డరోడ్డులోని ఆర్య సమాజ మందిరంలో ఆదివారం ప్రఖ్యాత వైదిక ధర్మ ప్రచారకులు కోనేరు జానకీదేవికి 'ఆర్యమాత', కొత్తమాసు మల్లికార్జునరావుకు 'ఆర్య పురుష' బిరుదులు ప్రదానం చేశారు. ఇద్దరికి రూ.25,116 నగదు పురస్కారాలతో సత్కరించారు. సభకు కోసరాజు రవీంద్ర అధ్యక్షత వహించారు. పండిత గోపదేవ్ వైదిక ధర్మ ప్రచార సమితి వ్యవస్థాపక కార్యదర్శి ఏలూరి సూర్యనారాయణ, నూతలపాటి అరవింద్, మాఘం కృష్ణమూర్తి, పులివర్తి శ్రీనివాసరావు, నాగభైరవ గంగాపార్వతి, గుర్రం నిర్మలాదేవీ, వాసిరెడ్డి శ్రీనివాసప్రసాద్ ప్రసంగించారు. భారతంలోని పద్యాలను డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ ఆలపించి అర్థాన్ని వివరించారు. అనంతరం వరల్డ్ షూటింగ్ జూనియర్ చాంపియన్షిప్లో 4 బంగారు పతకాలు సాధించిన నేలపల్లి ముఖేష్ను సత్కరించారు.

వదలరు... కదలరు...

జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. కనీసం పట్టించుకోకుండా ఆయా స్టేషన్ అధికారుల అండదండలతో బదిలీలు జరిగినప్పటికీ... కదలడం లేదు. ఆ స్టేషన్ల వదలని పరిస్థితి. గుంటూరు నగరంలోని పలు పోలీసుస్టేషన్ల పరిధిలో పరిస్థితి ఇదీ.

- పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతరు
- నగరంలోని పలు స్టేషన్ల సిబ్బందిని ఆయా స్టేషన్లకు మార్చిన ఎస్పీ
- సుమారు 35 మందిపైగా మారిస్తే.. సగానికిపైగా కదలని వైనం
- రేషన్ మాఫీయాలో కీ రోల్ పోషిస్తున్న ఆయా స్టేషన్ల డ్రైవర్లు
- స్టేషన్ నుంచి రిలీవ్ అయినా... నెలవారీ మామూళ్లు వసూలు చేస్తున్న సిబ్బంది
- చోరీ కేసులో సంబంధం లేకున్నా వ్యక్తిని బెదిరించి డబ్బులు గుంజిన హెడ్కానిస్టేబుల్



పట్నంబజారు: గత కొద్ది రోజుల పోలీసు జిల్లా ఉన్నతాధికారులు జిల్లా స్టేషన్ల పరిధిలోని సిబ్బందిని పలు ఆరోపణలు, వారి పనితీరుపై వచ్చిన విమర్శలు, ఇతరత్రా కోణాల్లో వారిని ఆయా స్టేషన్ల నుంచి బదిలీ చేశారు. సుమారు 35 నుంచి 40 మంది కానిస్టేబుళ్లను ఎస్పీ బదిలీ చేశారు. అయితే వారిలో సగం మందికిపైగా స్టేషన్లు వదలి వెళ్లడం లేదు. ఆఖరికి జిల్లా ఉన్నతాధికారే స్వయంగా స్టేషన్ అధికారులకు స్వయంగా ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఏ ఒక్కరూ కదటంలేదు. గుంటూరు ఈస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్కు అతి సమీపంలో ఉండే ఒక పోలీసుస్టేషన్లో మఫ్టీ పార్టీగా విధులు నిర్వర్తించిన ఒక కానిస్టేబుల్ను పలు ఆరోపణలు నేపథ్యంలో మేడికొండూరు పీఎస్కు బదిలీపై పంపారు. అయినా సదరు కానిస్టేబుల్ రేషన్ బియ్యం అక్రమ రవాణా చేసే వారిని బెదిరించి డబ్బులు వసూలు చేయటంతో పాటు, సుమారు ఐదు బార్ అండ్ రెస్టారెంట్ల వద్ద యారాక్లు తీసుకోవటం విస్మయానికి గురి చేస్తోంది. లంచం తీసుకోవటం పూర్తిగా నేరం అయిన పరిస్థితుల్లో.. స్టేషన్ మారినా కూడా తానే ఇక్కడ అని చెప్పుకుంటూ వసూళ్లకు పాల్పడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గుంటూరు రూరల్ పరిధిలోని ఒక స్టేషన్ గత మూడు రోజుల క్రితం ఒక నివాసంలో వస్తువులు పోయాయనే నెపంతో ఒక వ్యక్తి ఒక హెడ్కానిస్టేబుల్ తీసుకుకొచ్చాడు. సదరు వ్యక్తి నేరం చేయలేదని రుజువైనప్పటికీ.. రూ.20 వేలు అతడి వద్ద నుంచి తీసుకున్నాడు. గుంటూరు నుంచి విజయవాడకు వెళ్లే దారిలో ఉన్న ఒక పోలీసుస్టేషన్లో ఏకంగా నలుగురు సిబ్బంది ఒక హెడ్కానిస్టేబుల్, రైటర్గా విధులు నిర్వర్తిస్తున్న వ్యక్తి, ఇద్దరు కానిస్టేబుళ్లు కనీసం జిల్లా ఎస్పీ బదిలీ చేసినప్పటికీ కదలకపోవటం సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి. గుంటూరు వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని వ్యాపార సముదాయాలు అధికంగా ఉన్న ఒక స్టేషన్ పరిధిలో మఫ్టీ పార్టీగా వ్యవహరిస్తున్న కానిస్టేబుల్పై అనేక రకాల ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో అతడిని కూడా వేరే స్టేషన్కు బదిలీ చేసినా, ఇప్పటి వరకు అతను రిలీవ్ కాలేదు. పైగా సింగిల్ నెంబర్ లాటరీ, పేకాటాడుతున్న వారితో సత్సంబంధాలు కొనసాగిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. వెస్ట్ ట్రాఫిక్ పరిధిలోని లాడ్జిసెంటర్లో ఒక ట్రాఫిక్ ఎస్ఐ అసిస్టెంట్గా పనిచేస్తున్న కానిస్టేబుల్ మరో కానిస్టేబుల్ సోదరుడి వాహనాన్ని ఆపి, అతడి వద్ద నుంచి రూ.300 తీసుకుని పంపిన ఘటనపై వివాదం చోటు చేసుకుంది.

అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు



పోలీసు శాఖలో సిబ్బంది అవినీతికి పాల్పడినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఆధారాలు ఉంటే సస్పెండ్ చేసేందుకు వెనుకాడం. బాధితులు ఎవరైనా ఉంటే నేరుగా మా దృష్టికి తీసుకొస్తే విచారణ చేసి చర్యలు తీసుకుంటాం. ఇటీవల మార్చిన సిబ్బంది అంశంలో పలు శాఖపరమైన అడ్మినిస్ట్రేషన్ కారణాల వలన కొంత మంది సిబ్బందిని ఆ స్టేషన్ అధికారి అవసరాల మేరకు నెల, రెండు నెలల వరకు మినహాయింపు ఇచ్చాం. కచ్చితంగా బదిలీ చేసిన వారిని మారుస్తాం. అక్రమ వసూళ్లకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తాం.

– సతీష్కుమార్, ఎస్పీ, గుంటూరు జిల్లా

రథసారథులే.. రాజ్యమేలుతుంటే...

గుంటూరు నగరంలోని పలు స్టేషన్ల పరిధిలో ఆయా స్టేషన్ ఎస్హెచ్ఓ, రక్షక్ వాహనాలకు సంబంధిచిన డ్రైవర్లు రాజ్యమేలుతున్నారు. అధికారి సంబంధించి నైట్ డ్యూటీలు, ఏదైనా లాడ్జిల్లో దాడులు జరిగిటేప్పుడు, అర్ధరాత్రి వేళ మద్యం దుకాణాలకు పూర్తి స్థాయిలో సమాచారం అందించటంతో పాటు, నెలవారీ మామూళ్ల మత్తులో జోగుతున్నారు. ఈస్ట్ సబ్డివిజన్ పరిధిలోని లాడ్జిలు అధికంగా ఉన్న ప్రాంతంలో ఎస్హెచ్ఓ డ్రైవర్ దసరా మామూళ్ల పర్వానికి పెద్ద ఎత్తున తెరలేపాడని ఆ స్టేషన్ సిబ్బంది చెప్పుకుంటున్నారు. రాత్రి వేళల్లో అనుమతులు లేకుండా తీసి ఉండే పలు మాంసాహార హోటళ్లకు సంబంధించి అధికారులు వెళ్లే ముందే ముందస్తు సమాచారం అందిస్తున్న పరిస్థితులు ఉన్నాయని విమర్శలు ఉన్నాయి. దీంతో పాటుగా రేషన్ బియ్యం అక్రమంగా తరలించే వారి నుంచి ప్రతి ఒక్క డ్రైవర్కు నెలవారీ మామూళ్లు గిట్టుబాటు అవుతున్నాయనేది బహిరంగ రహస్యం. వెస్ట్ సబ్డివిజన్ పరిధిలో ఒక స్టేషన్లో ప్రైవేట్ డ్రైవర్ని వినియోగించుకుంటున్నారు. అయితే సదరు వ్యక్తి మాత్రం నిత్యం రాత్రి వేళల్లో తాను పోలీసునని చెప్పుకుంటూ దుకాణదారులను బెదిరింపులకు గురి చేస్తున్నాడని తెలుస్తోంది.

అన్నదానం



పట్నంబజారు: దసరా పండుగను పురస్కరించుకుని 4వ డివిజన్ తమ్మారంగారెడ్డి నగర్లో శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు, డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా ప్రారంభించారు. పార్టీ నేతలు కీసరి సబ్బులు, సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డెప్యూటీ మేయర్ బాలవజ్రబాబు, నూరిఫాతిమా మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ప్రతి ఒక్కరికి మేలు జరగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెహమూద్, వైఎస్సార్ సీపీ నేతలు సైకం లక్ష్మారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, సానికొమ్ము సుబ్బారెడ్డి, మాధవ్, మోహన్రెడ్డి, పుల్లారెడ్డి, శివపార్వతి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొరిటెపాడు: విద్యుత్ 11 కేవీ లైన్ల మరమ్మతుల దృష్ట్యా సోమవారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కరెంట్ ఉండదని చెప్పారు. నల్లచెరువు, సంగడిగుంట ప్రాంతాల్లోని వాసవి కన్యకా పరమేశ్వరి గుడిబజారు, చలమయ్య కాలేజీ, ముఫ్తీ వీధి, బాబు హోటల్ సెంటర్, ఆర్.అగ్రహారం, ఇనుస్తంభాల మేడ, పట్నంబజారు, వీఎస్నగర్, ఏటుకూరు రోడ్డు, సంగడిగుంట, గాంధీనగర్, మూడుబొమ్మల సెంటర్, నల్లచెరువు తదితర ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

మానసిక సమస్యల్ని నిర్లక్ష్యం చేయకండి

డాక్టర్ సురేష్ కుమార్



మాట్లాడుతున్న టి.ధనుంజయరెడ్డి

గుంటూరు మెడికల్: మానసిక సమస్యలు ఏ వయస్సు వారికైనా రావచ్చనని, తొలి దశలోనే గుర్తించి వైద్యుని సంప్రదించడం ద్వారా మందులు లేకుండానే, సమస్యల్ని కౌన్సెలింగ్ ద్వారా పరిష్కరించుకోవచ్చునని ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు, కాటూరి వైద్య కళాశాల సైకియాట్రి విభాగాతిపతి డాక్టర్ కే సురేష్ కుమార్ అన్నారు. ఆదివారం ఉదయం స్థానిక బ్రాడీపేటలోని సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ కార్యాలయంలో ఎస్హెచ్ఓ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా నిర్వహించిన మానసిక సమస్యల ఉచిత వైద్య సలహా శిబిరం, అవగాహన సభలో డాక్టర్ కె. సురేష్ కుమార్ పాల్గొన్నారు. సభకు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మెడికల్ క్యాంప్స్ చైర్మన్ టి.ధనుంజయ రెడ్డి అధ్యక్షత వహించారు. డాక్టర్ సురేష్ కుమార్ మాట్లాడుతూ నేటి సమాజ పరిస్థితులు, జీవన విధానంలో, ఆహారంలో వచ్చిన మార్పులు, వృత్తిపరమైన మానసిక ఒత్తిడి, ఆందోళనలు మానసిక సమస్యలకు కారణమవుతున్నాయన్నారు. ఇవి మానసిక వ్యాధులు కావన్నారు. కానీ వీటిని నిరోధించకపోతే, వీటివల్ల ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. మానసిక వ్యాధులతో పాటు బిపి, షుగర్లకు కారణమవుతున్నాయి అన్నారు. వీటిని తొలి దశలోనే గుర్తించి మానసిక వైద్య నిపుణులను సంప్రదించడం తగ్గించుకోవచ్చన్నారు. సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ టి.సేవకుమార్, టి.ధనుంజయ రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్హెచ్ఓ మేనేజర్ పి.నిర్మలారాణి, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ కె.ఆనందరావు, ఎస్.సాంబశివరావు, ఎం.రామారావు, టీవీ సాయిరాం, ఎస్.శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.



రెడ్లబజార్లో శ్రీకనకదుర్గ అమ్మవారి తెప్పోత్సవం

వైభవంగా అమ్మవారి గ్రామోత్సవం

నగరపాలెం: గుంటూరు నగరంలో దేవీ శరన్నవరాత్రులు శనివారం ముగిశాయి. సంగడిగుంట రెడ్ల బజార్లోని కనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారిని శ్రీరాజరాజేశ్వరీదేవీగా అలకరించారు. సాయంత్రం అమ్మవారి ఊరేగింపు అత్యంత వైభవంగా నిర్వహించారు. డప్పులు, నృత్యాలతో సందడిగా సాగింది. అనంతరం దేవస్థానం వద్ద అమ్మవారి తెప్పోత్సవం తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మారెడ్డి శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి మురాబోయిన నరసింహారావు, ఉపాధ్య క్షులు మద్దిరెడ్డి జగన్మోహన్రెడ్డి, మల్లం సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శి ఆరవ ఆంజనేయు లు, వత్రి అప్పారావు, కొండమూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

✦ స్థానిక ఆర్అగ్రహారం శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో దేవీశరన్నరాత్రులు ముగియగా, అమ్మవారు స్వర్ణ కవచ దర్శనంలో భక్తులు దర్శించుకున్నారు. అనంతరం సాయంత్రం ఆర్అగ్రహారం వద్ద మొదలైన అమ్మవారి ఊరేగింపు కన్నుల పండువగా జరిగింది. అమ్మవారు, స్వామి వార్ల వేషధారణలు, డప్పులు వాయిద్యాలతో నృత్యాలు, చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటాలు, విద్యుద్దీపాలతో ముందుకు కదిలారు. ఉత్సవ కమిటీ చైర్మన్ ఈరంటి వరప్రసాద్, కొనకళ్ల సత్యం పాల్గొన్నారు.



ఆర్అగ్రహారం కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం నుంచి ఊరేగింపు



చిన్నారుల కోలాటం

ముస్లిం మహిళల మజ్జిగ పంపిణీ..



గుంటూరు మెడికల్: గుంటూరు కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయం వద్ద మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు డాక్టర్ షమా సుల్తానా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సోదర భావంతో మెలగాలన్నారు. దాదాపు రెండు వేల మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గాయని సంగీత మెలేకర్కు సత్కారం



నగరంపాలెం: స్థానిక మార్కెట్ కూడలిలోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆదివారం కళాదర్బార్–అమరావతి ఆధ్వర్యంలో ప్రముఖ హిందీ స్టార్ గాయని సంగీత మెలేకర్ మెగా మ్యూజికల్ నైట్ నిర్వహించారు. కార్యక్రమానికి కళా దర్బార్ వ్యవస్థాపక అధ్యక్షులు పొత్తూరి రంగారావు అధ్యక్షత వహించారు. గాయని గాయకులు అనూష, ఇందునైన, శైలజ, పావని, జ్యోతిర్మయి, మురళీకృష్ణ, రామ్దాస్, షహన్వాజ్, శివకుమార్, బాబూరావు, అబ్దుల్ఖాదర్ హిందీ పాటలను ఆలపించారు. ప్రేక్షకులను అలరించాయి. ఎమ్మెల్యే నసీర్అహ్మద్, మిర్చి యార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు ప్రసంగించారు. అనంతరం సంగీత మెలేకర్ పలు గీతాలు అలపించగా, ఆమెకు సింగింగ్ స్టార్ అవార్డు ప్రదానం చేసి సత్కరించారు. కార్యక్రమంలో కళా దర్బార్ కమిటీ సభ్యులు బి.బాలస్వామి, రాజశేఖర్, హనుమాన్ సింగ్, పీటర్పాల్, సత్తార్ పాల్గొన్నారు.

నేడు ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణ

నెహ్రూనగర్: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక సోమవారం నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఇండియా పోస్ట్ 5కే రన్



అందజేస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

లక్ష్మీపురం: గుంటూరులో తపాలా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఇండియా పోస్ట్ రన్ – 2024 కార్యక్రమంలో కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ప్రజా ప్రతినిధులతో కలసి 5 కే రన్ లో పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం నగరంలో పారిశుద్ధ్య పనుల తనిఖీ నిమిత్తం నగరంలోని పలు ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో డ్రెయిన్లపై, రోడ్ల మీద ఆక్రమణలను తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. మంత్రి వెంట ఎమ్మెల్యే నసీర్ అహమ్మద్ ఉన్నారు.

19న 'ఎర్ర చెరువును కాపాడుకుందాం'



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రజక సంఘ నాయకులు

నెహ్రూనగర్: గుంటూరు టౌన్ రజక జన సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 19న ఎర్ర చెరువును కాపాడుకుందాం అనే అంశంపై బహిరంగ సభ నిర్వహించనున్నట్లు రాష్ట్ర రజక జన సేవా సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం పాతగుంటూరులో బహిరంగ సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత గుంటూరులోని గంగానమ్మ కమ్యూనిటీ హాల్లో సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కొంత మంది ఎర్రచెరువు పేరుతో స్వార్థంగా సంఘాలు సృష్టించి, దాని చుట్టూ ఆక్రమించుకుని చెరువును కూడా తమ ఆధీనంలోకి తీసుకునేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. బహిరంగ సభకు రజకులంతా హాజరై ఎర్రచెరువును కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రజక సంఘ నాయకులు సాంబయ్య, రమాదేవి, వెంకటేశ్వర్లు, వీరాస్వామి పాల్గొన్నారు.

కళలు, కళారూపాలు లేకపోతే సమాజమే కాదు



విజేతలతో అతిథులు

- హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి
- ఘనంగా శ్రీత్యాగరాజ సాంస్కృతిక సంఘం వార్షికోత్సవ సభ

నగరంపాలెం: కళలు, కళారూపాలు లేని సమాజం సమాజమే కాదని ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి అన్నారు. ఆదివారం లక్ష్మీపురం శ్రీత్యాగరాజస్వామి కళావేదికపై శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం 46వ వార్షికోత్సవ సందర్భంగా సంగీత మహోత్సవాలు నిర్వహించారు. సభకు సంఘం కార్యదర్శి వల్లూరి కృష్ణకిషోర్ అధ్యక్షత వహించారు. జస్టిస్ శేషసాయి, అర్చక అకాడమీ పూర్వ డైరెక్టర్ డాక్టర్ వేదాంతం రాజగోపాల్ చక్రవర్తి, సంస్థ అధ్యక్షులు డాక్టర్ రామరాజు శ్రీనివాస్లు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. జస్టిస్ ఏవీ శేషసాయి మాట్లాడుతూ ఆధునికత పేరుతో మన సంప్రదాయ కళారూపాలను విస్మరిస్తున్నారని అన్నారు. అటువంటి సమయంలో జాగరూకత చాలా అవసరమని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు తమ పిల్లలను సంప్రదాయబద్ధంగా ఉండేలా కాపాడుకోవాలని అన్నారు. ఏ జాతి సంస్కృతీ, సంప్రదాయాలను మర్చిపోతే, ఆ జాతి వినాశనమయ్యేందుకు కారణమని చెప్పారు. సభానంతరం కర్ణాటక సంగీత పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. సిక్కిల్ గురుచరణ్(చెన్నై) ఆధ్వర్యంలో నిర్వహించిన కర్ణాటక గాత్ర సంగీత కచేరి అలరించింది. సభలో సంస్థ ఉపాధ్యక్షుడు ఎస్.గిరిజాశంకర్, వై.రాజ్యలక్ష్మి, ఫణితేజ పాల్గొన్నారు.


ఆదమరిస్తే అంతే...!



డొంక రోడ్డు(మూడు వంతెనల వద్ద) గుంత వద్ద రాళ్లు పెట్టిన వాహనదారులు

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో రెండు రోజుల నుంచి కురిసిన వర్షాలకు డొంకరోడ్డులోని(మూడు వంతెనల వద్ద) రోడ్డు కోతకు గురైంది. దీంతో అక్కడ పెద్ద గుంత ఏర్పడింది. నిత్యం వేలాది మంది వాహనదారులు కొత్తపేట నుంచి అమరావతి రోడ్డుకు వెళ్తుంటారు. అయితే దీనికి కనీస ప్యాచ్ వర్కు చేయకుండా ఇంజినీరింగ్ అధికారులు చోద్యం చూస్తున్నారు. రాత్రి వేళల్లో కొంత మంది వాహనదారులు నీటితో నిండిన గుంతను చూడకుండా దానిలో దిగి కిందపడిన ఘటనలు లేకపోలేదు.

జిల్లా ఎస్పీకి సన్మానం



నగరంపాలెం: స్థానిక నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ(డీపీఓ) ఆవరణలో జిల్లా ఎస్పీ సతీష్కుమార్ను ఆదివారం ఏపీ స్టేట్ రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం జిల్లా ఎస్పీని సత్కరించారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ కేసుల దర్యాప్తులో సంఘ సభ్యుల అనుభవాలు, సహకారం తీసుకుంటామని చెప్పారు. అనారోగ్యం, పెన్షన్లు, ఇతరత్రా సమస్యలపై నేరుగా సంప్రదించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.సత్య నారాయణ(విశ్రాంత ఏఎస్పీ), చక్రపాణి, వైటీ నాయుడు, మేక రమేష్(విశ్రాంత ఎస్పీలు), కేవీ నారాయణ, రవికుమార్ (విశ్రాంత డీఎస్పీ) పాల్గొన్నారు.